ఆహ్లాదం.. ఆరోగ్యం



ఏర్పాటు చేసిన బెంచీలు

న్యూస్‌టుడే, జగిత్యాల గ్రామీణం

ఉరుకులు పరుగుల జీవితంలో క్షణం తీరిక లేకుండా ఉండే ప్రజలకు ఆహ్లాదం కరవైంది. పట్టణంలో పచ్చదనం, స్వచ్ఛమైన గాలి లభించడం గగనంగా మారింది. ఆ కొరత తీర్చేందుకు జగిత్యాల సమీపంలో అర్బన్ అటవీ పార్కు అందుబాటులోకి రానుంది. గతేడాది రూ.2 కోట్ల నిధులు మంజూరు కాగా ఇప్పటివరకు 50 శాతం పనులు పూర్తయ్యాయి.

అర్బన్ అటవీ పార్కులో 50 శాతం పనులు పూర్తి

జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలోని అటవీ ప్రాంతంలో పార్కు నిర్మాణం జరుగుతోంది. జగిత్యాల పట్టణానికి కేవలం 4 కి.మీ దూరంలో ఉండే అటవీ అర్బన్ పార్కులో చెరువు నిర్మాణం పూర్తి కాగా, వాచ్‌టవర్ పనులు కొనసాగుతున్నాయి. ఎత్తయిన ప్రాంతంలో నిర్మిస్తున్న వాచ్‌టవర్ పైకి ఎక్కి అక్కడి నుంచి జగిత్యాల పట్టణాన్ని వీక్షించి, ఫొటోలు తీసుకోవచ్చు. ఉదయం, సాయంత్రం వేళల్లో నడక కోసం 3 కి.మీ వాకింగ్ ట్రాక్ నిర్మాణం జరుగుతోంది. పిల్లలు ఆడుకునేందుకు పార్కు, ఆటవస్తువుల ఏర్పాటు, పార్కు చుట్టూ ఫెన్సింగ్, బెంచీలు ఏర్పాటు చేస్తున్నారు. పచ్చదనం కోసం మొక్కలు పెంచుతున్నారు. తాగునీటి సౌకర్యం, మూత్రశాలలు, రహదారి పనులు చేపట్టాల్సి ఉంది. రహదారి నిర్మాణం కోసం నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ తెలిపారు.



అర్బన్ అటవీ పార్కులో చెరువు

అర్బన్ పార్కు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లా అటవీ అధికారి రవిప్రసాద్‌తో కలిసి పనులను పరిశీలించారు.

సెలవు దినాల్లో కాలక్షేపం కోసం...

జగిత్యాల పట్టణంలో లక్షకు పైగా జనాభా నివసిస్తున్నారు. పిల్లలకు కాలక్షేపం కోసం జగిత్యాల ప్రాంతంలో చెప్పుకోదగ్గ ప్రదేశం అంటూ ఏదీ లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో అంబారిపేట వద్ద నిర్మిస్తున్న అర్బన్ అటవీ పార్కు ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది. పక్కనే శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం, పార్కులో గడిపి సమీపంలో లింగంపేట రైల్వే స్టేషన్ కూడా వీక్షించే అవకాశం ఉంది. మరో వైపు బీర్‌పూర్ రోళ్ల వాగు ప్రాజెక్టు కూడా పూర్తయితే అక్కడ కూడా పార్కు, బోటింగ్ ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే ఆలోచన చేస్తున్నారు. సారంగాపూర్ అటవీ ప్రాంతం పర్యాటకంగా ఎంతో ఆహ్లాదం పంచుతోంది.

జిల్లా కేంద్రంలో పర్యాటక అభివృద్ధి



-డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే

జిల్లా కేంద్రంలోని ప్రజల కోసం అర్బన్ అటవీ పార్కు పనులు రూ.2 కోట్లతో జరుగుతున్నాయి. ఈ పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్నాను. రహదారి నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. మౌలిక వసతుల కల్పన సాగుతోంది. బీర్‌పూర్ రోళ్ల ప్రాజెక్టులో బోటింగ్ కూడా ఏర్పాటు చేస్తాం.

పనులు కొనసాగుతున్నాయి



-రవి ప్రసాద్, జిల్లా అటవీ అధికారి

పార్కు ఏర్పాటు, బెంచీల నిర్మాణం, వాచ్‌టవర్ పనులు కొనసాగుతున్నాయి. పార్కును అభివృద్ధి చేసి పట్టణ ప్రజలకు మంచి పర్యాటక ప్రాంతాన్ని త్వరలోనే అందిస్తాం. తాగునీరు, మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టాల్సి ఉంది.

జగిత్యాల-దాదర్ రైలు పునఃప్రారంభం

జగిత్యాల: జగిత్యాల నుంచి దాదర్(ముంబై) రైలు పునఃప్రారంభం కానుంది. ప్రతి బుధవారం సాయంత్రం 5.46 గంటలకు జగిత్యాల నుంచి ప్రారంభమై గురువారం మధ్యాహ్నం 1.25 గంటలకు దాదర్ చేరుకుంటుంది. తిరిగి గురువారం మధ్యాహ్నం 3.25 గంటలకు దాదార్ నుంచి బయలు దేరి శుక్రవారం ఉదయం 11.49 గంటలకు జగిత్యాలకు చేరుకుటుందని రైల్వే అధికారులు తెలిపారు.

సన్న ధాన్యం మిల్లింగ్‌కు ససేమిరా

క్వింటాకు 67 శాతం బియ్యం ఇవ్వలేమంటున్న మిల్లర్లు

న్యూస్‌టుడే, హుజూరాబాద్

ఉమ్మడి జిల్లాలోని మిల్లర్లు సన్న ధాన్యం మిల్లింగ్‌కు ససేమిరా అంటున్నారు. క్వింటాకు 67 శాతం బియ్యం ఇవ్వలేమని చేతులెత్తేస్తున్నారు. మిల్లింగ్ నిబంధనలు సడలించి క్వింటాకు కొంత పరిహారం, కస్టోడియన్, మిల్లింగ్, రవాణా ఛార్జీలు పెంచాలని మిల్లర్లు డిమాండ్ చేస్తూ.. ఈ సమస్య పరిష్కారం కానిదే ధాన్యాన్ని మిల్లింగ్‌కు తీసుకోమని స్పష్టం చేస్తున్నారు. ఇదే విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతుండగా మిల్లర్ల మెలికతో సన్నధాన్యం సేకరణ చిక్కు సమస్యగా మారనుంది.



దిగుబడి ఇలా..

ఉమ్మడి జిల్లాలో వానాకాలం సీజన్‌లో 11.75 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. 20.59 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనాకొచ్చారు. ఇందుకోసం 1,360 కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఈసారి 31 రకాల సన్నధాన్యాన్ని పండించిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో మునుపెన్నడూ లేని విధంగా వానాకాలం సీజన్‌లో అత్యధిక శాతం సన్నాలు సాగు చేశారు. ఉమ్మడి జిల్లాలో 3,90,967 ఎకరాల్లో సన్నాలు సాగైంది. కరీంనగర్ జిల్లాలో 2,48,623 మెట్రిక్ టన్నులు, జగిత్యాలలో 1,72,150 మెట్రిక్ టన్నులు, పెద్దపల్లిలో 3.44 లక్షల మెట్రిక్ టన్నులు, రాజన్న సిరిసిల్లలో 28,457 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. మొత్తంగా 7.93 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని ప్రత్యేక కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు అంతా సిద్ధం చేశారు. సన్నాలకు కేంద్రం క్వింటాకు రూ.2,320 మద్దతు ధర చెల్లిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ కలిపి రూ.2,820 చొప్పున కొనుగోలు చేయనుంది. దొడ్డు ధాన్యంతో వచ్చే బియ్యాన్ని ఎఫ్‌సీఐ (భారత ఆహార సంస్థ)కు వెళ్తాయి. కొనుగోలు కేంద్రాలకు వచ్చే సన్నధాన్యాన్ని మిల్లింగ్ చేశాక వచ్చే బియ్యాన్ని రేషన్ కార్డుదారులకు, సంక్షేమ వసతి గృహాలకు ఉపయోగించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. కానీ సన్న ధాన్యం మిల్లింగ్‌కు మిల్లర్లు ససేమిరా అనడంతో ఈ సమస్య కొలిక్కి వచ్చిన తర్వాతే సన్నధాన్యం కొనుగోలు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. నిబంధనలు సడలించాలని రారైస్ మిల్లర్స్ అసోయేషన్ అధ్యక్షుడు తనుకు సురేశ్ తదితరులు కోరుతున్నారు.

ఇదీ సమస్య

✦ సాధారణంగా దొడ్డు రకం ధాన్యం మిల్లింగ్ చేస్తే క్వింటాకు 67 కిలోల బియ్యం వస్తాయి. అదే సన్న రకం ధాన్యం మిల్లింగ్ చేస్తే 57 కిలోలకు మించి బియ్యం రావని మిల్లర్లు అంటున్నారు.

✦ దొడ్డు, సన్నాలకు చెందిన ఏ రకం ధాన్యం మిల్లింగ్ చేసినా క్వింటాకు రూ.67 కిలోల బియ్యం సీఎంఆర్ కింద అప్పగించాలని ప్రభుత్వం అంటుందని చెబుతున్నారు.

✦ సన్నరకాలను తీసుకుని మిల్లింగ్ చేస్తే క్వింటాకు 10 కిలోల బియ్యం తక్కువగా వస్తుంది. ఈ లోటును ఎవరు భరిస్తారని మిల్లర్లు ప్రశ్నిస్తున్నారు.

✦ పైగా 17 శాతం తేమ ఉన్న సన్నరకం ధాన్యాన్ని దిగుమతి చేసుకుంటే 20 రోజుల్లో రంగు మారిపోయే ప్రమాదం ఉందని, ఇవే బియ్యాన్ని మిల్లింగ్ చేస్తే బియ్యం తీసుకునే సమయంలో నాణ్యత లేదంటూ అధికారులు కొర్రీలు పెడితే తాము నష్టపోవాల్సి వస్తుందంటున్నారు.

✦ అంతేకాక తేమ నిబంధనను 17 నుంచి 14 శాతానికి తగ్గించాలని.. సన్న బియ్యం సరఫరాలో క్వింటాకు రూ.300 పరిహారం, కస్టోడియన్, మిల్లింగ్, రవాణా ఛార్జీలు పెంచాలని మిల్లర్లు డిమాండ్ చేస్తూ ఈ సమస్య పరిష్కారం కానిదే ధాన్యాన్ని మిల్లింగ్‌కు తీసుకోమని స్పష్టం చేస్తున్నారు.

✦ క్వింటాకు ఎన్ని కిలోల బియ్యం వచ్చినా తీసుకునేలా నిబంధన సడలించాలని కోరుతున్నారు.

✦ దీంతోపాటు 20 ఏళ్లుగా మిల్లింగ్ ఛార్జీలు పెంచకపోవడంతో అనేక సమస్యలు తమను వేధిస్తున్నాయని అంటున్నారు.

✦ రాష్ట్రం క్వింటాకు రూ.30 చెల్లిస్తున్నారు, పెరిగిన విద్యుత్తు ఛార్జీలు, కార్మికుల కూలీలు కలిపితే తమకు అసలే గిట్టుబాటు కావడం లేదంటున్నారు.

పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

ధర్మపురి, న్యూస్‌టుడే: భారాస హయాంలో ధర్మపురి ప్రాంతం అభివృద్ధి చెందలేదని ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంస్కృతాంధ్ర కళాశాలలో నూతన అవుట్ సోర్సింగ్ విధానంలో ఎంపిక చేసిన సిబ్బందికి నియామక పత్రాలను ఆయన అందజేశారు. గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ ధర్మపురి తెలుగు కళాశాలపై నిర్లక్ష్యం ప్రదర్శించడంతో మూతపడిపోయిందని.. ప్రారంభించాలనే దృఢ సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లినట్లు తెలిపారు. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. మొదటి దశలో రూ.5 లక్షల సీడీసీ నిధులతో పూర్తి స్థాయిలో కళాశాల మరమ్మతులు చేయడంతోపాటు బోధనా సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ధర్మపురిలో ఇంటిగ్రేటెడ్ వసతి గృహ నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు దినేష్, తెలుగు కళాశాల కార్యదర్శి రామక్రిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి నియామక పత్రాలను అందజేస్తున్న విప్ లక్ష్మణ్ కుమార్


సంకష్టహర చతుర్థి పూజలు

ధర్మపురి, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సంకష్టహర చతుర్థి సందర్భంగా ఆదివారం స్వామి వారికి వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానానికి ఆదివారం రూ.1,82,116 ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.



గణపతికి పూజలు చేస్తున్న వేద పండితులు

పరచుకొన్న పచ్చదనం



ఎండపల్లి మండలంలోని అంబారిపేట రహదారి పొడువునా చెట్లు ఏపుగా పెరిగి నీడ పరచుకుంది. గ్రామంలోకి వెళ్లే దారిలో కొన్నేళ్ల క్రితం నాటిన వేప వృక్షాలు దట్టంగా ఉన్నాయి. ఇటీవల పెరిగిన ఎత్తైన చెట్లతోనూ దారి ఒక గుహలాగా పచ్చదనం పరచుకొని కనువిందు చేయడంతోపాటు ఆహ్లాదభరితంగా ఉంది. - వెల్గటూరు, న్యూస్‌టుడే

వంగినా.. సరిచేయరా?



పల్లె ప్రకృతి వనంలో ఇలా..

మండలకేంద్రంలో పలు చోట్ల విద్యుత్తు స్తంభాలు ఓ వైపునకు వంగి ప్రమాదకరంగా మారాయి. పాత పోలీస్ స్టేషన్ వద్ద హైమాస్ట్ లైట్ల కోసం ఏర్పాటు చేసిన స్తంభం ఓ వైపునకు వంగి ఉంది. పల్లె ప్రకృతి వనంలో ఉన్న విద్యుత్తు స్తంభం ఓ వైపునకు వంగి పోయి ప్రమాదకరంగా ఉంది. అయినప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి సరిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం



పోలీస్ స్టేషన్ వద్ద హైమాస్ట్ దీప స్తంభం

మూల మలుపు.. మృత్యు పిలుపు

జగిత్యాల నుంచి ధర్మపురి వెళ్లే జాతీయ రహదారిపై నేరెల్ల పసుల పాపన్న గుట్ట వద్ద మూల మలుపు ప్రమాదకరంగా మారింది. దట్టంగా పెరిగిన చెట్ల కొమ్మలు. . పక్కనే శిథిలమైన లోలెవల్ వంతెనతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వంతెన వద్ద రహదారి ఇరుకుగా ఉండటం.. ఇరువైపులా దట్టంగా చెట్లు ఉండటంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం వేలాది వాహనాలు నడిచే ఈ దారిలో రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది.

- న్యూస్‌టుడే, ధర్మపురి గ్రామీణం



చోరీలు పరిపాటి.. రికవరీ ఏపాటి?

- ఘటన సమయంలో హడావుడి.. ఆపై విస్మరణ
- పోయిన సొమ్ము రాబట్టడంలో పోలీసుల నిర్లక్ష్యం

ఈనాడు, కరీంనగర్

కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో 2022లో అన్ని రకాల చోరీలు కలిపి 248 కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ ఎఫ్ఐఆర్‌లు నమోదైనవి. కేసు కాకుండా బాధితులు వెనుదిరిగినవి మరో 200 వరకుంటాయి. 2023లో 330 చోరీలు జరిగాయి. ఈ ఏడాది ఇప్పటివరకే ఆ సంఖ్య 300 దాటింది. గతేడాది రూ.2 కోట్ల విలువైన సొత్తు చోరీకి గురి కాగా పోలీసులు రూ.94,91,786ను మాత్రమే తిరిగి స్వాధీనం చేసుకోగలిగారు.

✦ రాజన్న సిరిసిల్ల జిల్లాలో గతేడాది నమోదైన 327 కేసుల్లో 158 మాత్రమే ఛేదించారు. రూ.1.58 కోట్లు పోగా రూ.59.70 లక్షలు బాధితులకు ఇప్పించగలిగారు. రూ.కోటి వరకు రికవరీ కాలేదు. అంతకు ముందు ఏడాది(2022)లో 114 ఘటనల్లో దొంగలు పట్టుబడ్డారు. 121 కేసుల అతీగతి లేదు. రూ.45.04 లక్షలు మాత్రమే స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది 200 వరకు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.


✦ పెద్దపల్లి జిల్లాలో 2022లో 679 చోరీలు జరిగాయి. బాధితులు రూ.4.47 కోట్లు పోగొట్టుకోగా రూ.59.21 లక్షలు మాత్రమే తిరిగి ఇప్పించగలిగారు. గతేడాది 725 ఎఫ్ఐఆర్‌లు నమోదై రూ.1.99 కోట్లు పోగా రూ.40.99 లక్షలను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. జగిత్యాల జిల్లాలో గతేడాది 113.2 తులాల బంగారు ఆభరణాలను, 1508 తులాల వెండి ఆభరణాలను బాధితులకు అందించగలిగారు. మరో 80 తులాల ఆభరణాలను రికవరీ చేయాల్సి ఉంది.



- జగిత్యాల జిల్లాలో మూడు నెలలుగా చోరీలు పెరిగాయి. ఇళ్లతో పాటు చిన్న ఆలయాలు, దుకాణాల్లోకి చొరబడుతూ దొంగలు అందిన కాడికి దోచుకెళ్తున్నారు. పెద్దపల్లి జిల్లా పరిధిలో ఈ ఏడాది ఇప్పటివరకు 302 చోరీలు జరిగాయి. సగటున రెండు రోజులకో కేసు నమోదైంది. సిరిసిల్ల జిల్లాలోనూ అడపాదడపా చోరీ ఘటనలపై ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ ఏడాది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వెయ్యికి పైగా కేసుల్లో దొంగలు చేతివాటం చూపారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చోరీలు పెరుగుతున్నాయి. పాత, కొత్త నేరస్తులపై నిఘా పెట్టండి. సొత్తు రికవరీలో మీరెందుకు వెనుకబడ్డారు? నేరగాళ్ల పట్టివేతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి. చోరీలను నిలువరించండి.

-ఈ ఏడాది ఆగస్టు 19న కరీంనగర్‌లో నిర్వహించిన నేర సమీక్షలో డీజీపీ జితేందర్



- ఈ ఏడాది జులై 7న పట్టపగలే అలుగునూరులో రాజీవ్ రహదారికి ఆనుకుని ఉన్న ఇంట్లో దొంగలు పడ్డారు. తాళం పగులగొట్టి లోనికి చొరబడిన దొంగలు 8 తులాల బంగారు ఆభరణాలు సహా రూ.46 వేలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో పరిశీలించిన పోలీసులు, క్లూస్ టీం సభ్యులు ఇప్పటివరకూ దొంగలను గుర్తించలేదు. రెండు, మూడు రోజులు హడావుడి చేసి ఆ తర్వాత వదిలేశారు. బాధితులు మాత్రం ఠాణా చుట్టూ తిరుగుతున్నారు.



పోయింది ఎక్కువ.. ఫిర్యాదులో తక్కువ

చోరీ ఘటనల్లో బాధితులు ఎక్కువ మొత్తం పోగొట్టుకున్నా పోలీసులు వారితో తక్కువ మొత్తాన్ని ఫిర్యాదుల్లో రాయిస్తున్నారు. రూ.లక్ష కన్నా ఎక్కువ ఉండకుండా చూస్తున్నారు. పెద్ద కేసులపై దృష్టి సారిస్తూ చిన్న చోరీ ఘటనల విషయంలో ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. ఆలయాల్లో దొంగతనాలు జరిగినప్పుడు తక్కువ మొత్తంలో సొత్తు పోయినట్లు నమోదు చేస్తున్నారు. రికవరీ అయినప్పుడు పూర్తిగా ఇప్పిస్తామని బాధితులను ఒప్పించి ఫిర్యాదులు రాయిస్తున్నారు. ఇక రూ.వేలల్లో పోయిన సొత్తుకైతే కేసులే నమోదు చేయడం లేదనే ఆరోపణలున్నాయి.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్

జగిత్యాల, న్యూస్‌టుడే: రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. భారాస పిలుపు మేరకు ఆదివారం జగిత్యాలలో నిరసన ప్రదర్శన జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుబంధును రైతుభరోసాగా మార్చి రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచుతామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే ఎగ్గొట్టారని అన్నారు. ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీలు ఇచ్చి అమలు చేయటం లేదని రుణమాఫీ పూర్తిస్థాయిలో వర్తింపజేయలేదన్నారు. అన్ని రకాల ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని రైతు భరోసా వెంటనే ఇవ్వాలని వసంత డిమాండ్ చేశారు. జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ వొద్దినేని హరిచరణ్‌రావు, శీలం ప్రవీణ్, తుమ్మ గంగాధర్, వొల్లెం మల్లేశం, ఆనంద్‌రావు, గంగారెడ్డి, బుర్ర ప్రవీణ్‌గౌడ్, వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు.



ధర్నా చేస్తున్న నాయకులు

12 ఏళ్లుగా నిరుపయోగంగా..

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల మండల కేంద్రంలో నిర్మించిన స్త్రీశక్తి భవనం ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా మారింది. తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(టీ-సెర్ప్) కోరుట్ల మండల కార్యాలయాన్ని ఆదర్శనగర్‌లో 2010లో చిన్న భవనంలో ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 986 మహిళా సంఘాలు, మొత్తం 10,160 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. పాత భవనం సరిపోకపోవడంతో కార్యాలయ ఉద్యోగులు, మహిళలు చాలా ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 2012లో అప్పటి ప్రభుత్వం మండలానికి ఒక అధునాతన స్త్రీ శక్తి భవనం నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ.25 లక్షలను మంజూరు చేసింది. ఈ నిధులతో మండల పరిషత్ కార్యాలయం వెనకాలున్న ఖాళీ స్థలంలో నూతన భవన నిర్మాణం ప్రారంభించారు. నిధులు సరిపోకపోవడంతో 2016లో మరో రూ.7 లక్షలను కేటాయించారు. మొత్తం రూ.32 లక్షల నిధులు వెచ్చించి స్త్రీ శక్తి భవనం నిర్మించారు. భవన నిర్మాణ పనులు సకాలంలో పూర్తిచేయక పోవడంతో ఏళ్లతరబడి తీవ్ర జాప్యం చేస్తున్నారు. భవనం ఖాళీగా ఉండడంతో తహసీల్దార్ కార్యాలయ ఎన్నికల సామగ్రి, ఇతర పరికరాలతో నింపేశారు. ఓ గదిలో అంతర్జాల యంత్రాలను ఉంచారు. మహిళా సంఘాల సభ్యుల కోసం లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం వినియోగంలోకి తేకపోవడం ఇతర శాఖలకు అప్పగించడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నిర్మించి వదిలేసిన స్త్రీ శక్తి భవనం

సమగ్ర కుల గణనకు కార్యాచరణ

న్యూస్‌టుడే, కరీంనగర్ పట్టణం

సామాజిక, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ బీసీ గణన చేపట్టేందుకు అధికార యంత్రాంగం కార్యాచరణకు సిద్ధమైంది. సర్వేకు సంబంధించిన విధి విధానాలు వెలువడగానే ప్రక్రియను ప్రారంభించనున్నారు. ప్రధానంగా వివిధ శాఖల సమన్వయంతో ముందుకెళ్లాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధ్యాయులు మినహా ఇతర శాఖల సేవలను ఇందుకోసం వినియోగించనుంది.

వివిధ శాఖల సమన్వయం: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ముందు బీసీ కుల గణన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అనేక తర్జన, భర్జన అనంతరం సామాజిక, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ వివరాల గణనతోపాటు బీసీ కులగణన సర్వే చేయనున్నారు. నిరంతరం క్షేత్ర స్థాయిలో ఉండే ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మెప్మా ఉద్యోగులు, ఏఎన్ఎంలు, స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించనున్నారు. 150 ఇళ్లకు ఒక యూనిట్‌గా తీసుకొని సర్వే చేపట్టేందుకు బాధ్యతలు అప్పగించనున్నారు. గ్రామ, వార్డు స్థాయిలో సమగ్రంగా ఇది కొనసాగనుంది. కేంద్ర ప్రభుత్వం 2011లో నిర్వహించిన జనగణన తర్వాత ఈసారి కొత్త విధానంతో రూపకల్పన చేసి కుల గణనకు శ్రీకారం చుట్టనున్నారు. గతంలో భారాస ప్రభుత్వం సమగ్ర సర్వే చేసినా ఉపయోగం లేకుండా పోయింది. సర్వేను 60 రోజుల్లో పూర్తి చేయడం ద్వారా బీసీ గణనతోపాటు ఇతర వివరాలను వెలుగులోకి వచ్చే అవకాశముంది. ఉమ్మడి జిల్లా కేంద్రంగా తీసుకొని అవసరమైన పటాలు, వివరాలు సేకరించి సర్వే సిబ్బందికి అప్పగించనున్నారు.

మార్గదర్శకాలు రావాల్సి ఉంది: కులగణనకు సంబంధించిన మార్గదర్శకాలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని, కలెక్టర్ల ఆదేశాల మేరకు కార్యక్రమం చేపడతామని అధికార వర్గాలు తెలిపాయి. ప్లానింగ్ శాఖ సర్వే కార్యక్రమం సమన్వయం చేస్తోంది.

ఎస్సారెస్పీ 12 గేట్ల ద్వారా నీటి విడుదల

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టు 12 గేట్లను తెరచి 37,488 క్యూసెక్కుల నీటిని ఆదివారం సాయంత్రం గోదావరిలోకి విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 13,566 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఎగువన వర్షాలతో వరద పెరిగే అవకాశమున్నందున దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి అన్ని కాలువలు, ఎత్తిపోతలు, మిషన్ భగీరథ పథకానికి కలిపి ఇన్‌ఫ్లోతో సమానంగా ఔట్‌ఫ్లో కొనసాగిస్తున్నారు.

దిగువ మానేరు జలాశయం నుంచి..


తిమ్మాపూర్ : మధ్య మానేరు జలాశయం నుంచి ఎల్ఎండీకి ఇన్‌ఫ్లో వస్తుండడంతో నీటి పారుదల శాఖ అధికారులు ఆదివారం రెండు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఎల్ఎండీకి 4800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. రెండు గేట్లను ఒక అడుగు మేర ఎత్తి 4277 క్యూసెక్కులను వాగులోకి వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. జలాశయంలో ప్రస్తుతం 24.034 టీఎంసీల నీరున్నట్లు వారు చెప్పారు.

ఉమ్మడి జిల్లా ఖోఖో జట్టుకు క్రీడాకారుల ఎంపిక



సుడా ఛైర్మన్ నరేందర్‌రెడ్డితో క్రీడాకారులు

కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా ఖోఖో జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నరేందర్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని క్రీడల్లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. స్పోర్ట్స్ విశ్వవిద్యాలయాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటుకు కృషి చేస్తున్నారన్నారు. ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.మహేందర్‌రావు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా నుంచి 375 మంది బాలబాలికలు ఈ పోటీలకు హాజరయ్యారన్నారు. పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఈనెల 28 నుంచి 30 వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కుమారస్వామి, ఉమ్మడి జిల్లా ఖోఖో సంఘం బాధ్యులు సూర్యప్రకాశ్, సంతోష్, మోయినుద్దీన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.




అజరామరం.. ఆ త్యాగం

నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

న్యూస్‌టుడే, గోదావరిఖని

పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహించుకోవడం వెనుక సైనికుల వీరోచిత పోరాటం దాగుంది. 1959 అక్టోబరు 21న భారత్-చైనా సరిహద్దున సియాచిన్ ప్రాంతంలోని భూ భాగాన్ని ఆక్రమించేందుకు చైనా రక్షణ బలగాలు యత్నించాయి. ఆ సమయంలో డీఎస్పీ కరమ్‌సింగ్ ఆధ్వర్యంలో పంజాబ్‌కు చెందిన 21 మంది జవాన్లు అక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. అక్సయ్‌చిన్ ప్రాంతంలోని హాట్‌స్ప్రింగ్ వద్ద జరిగిన పోరాటంలో పది మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు అమరులయ్యారు. వీరుల రక్తం పారిన ఆ ప్రదేశాన్ని పవిత్ర స్థలంగా భావించి ఏటా అన్ని రాష్ట్రాల పోలీసులు సందర్శించి నివాళులర్పిస్తున్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం అక్టోబరు 21ని పోలీసు అమరవీరుల దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలువురు పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారు.

'కనిపించే మూడు సింహాలు చట్టానికి, న్యాయానికి, ధర్మానికి ప్రతిరూపాలైతే కనిపించని నాలుగో సింహమేరా పోలీస్' అని అంటాడు ఓ సినిమాలో కథానాయకుడు.. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో ముందుంటున్న రక్షకభటుల త్యాగాలకు ఈ మాట చక్కగా నప్పుతుంది.. సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా నిద్రించడానికి కంటి మీద కునుకు లేకుండా సేవలందిస్తున్న పోలీసుల త్యాగం అజరామరం.. విధి నిర్వహణలో ప్రాణాలు వదిలిన అమరులను స్మరించుకోవడం ప్రతి పౌరుడి కర్తవ్యం..



ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రాణ త్యాగం



గోదావరిఖని ఏఆర్ సబ్ హెడ్‌క్వార్టర్‌లో రిజర్వు ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన ఎస్.సంజీవరెడ్డికి 1999 సెప్టెంబరు 20న మహాముత్తారం మండలంలో రీపోలింగ్ భద్రత విధులు అప్పగించారు. ముందస్తుగా వెళ్లి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేయాల్సి ఉంది. సంజీవరెడ్డి ఇంట్లో శుభకార్యం ఉన్నా విధులపై నిబద్ధతతో తన బృందంతో వెళ్లారు. దొబ్బలపాడు వద్ద రోడ్డును తనిఖీ చేస్తుండగా మావోయిస్టులు మందుపాతర పేల్చారు. ఆ ఘటనలో సంజీవరెడ్డితో పాటు కానిస్టేబుళ్లు మీస రవీందర్, కె.బాపు, బి.లక్ష్మీరాజం మృతి చెందారు. ప్రశాంత పోలింగ్ లక్ష్యంగా బందోబస్తు విధులకు ధైర్యంగా వెళ్లిన సంజీవరెడ్డి సాహసాన్ని ఇప్పటికీ పోలీసులు గుర్తు చేసుకుంటారు.



ఆయన సేవలు చిరస్మరణీయం

మల్హర్ మండలం రుద్రారంలో బ్యాంకును దహనం చేసినట్లు సమాచారం రావడంతో 1993 జూన్ 14న కొయ్యూరు ఎస్ఐ ఎం.ఎ.సుభాన్ పోలీసు బృందంతో ట్రాక్టరులో బయల్దేరారు. సుభాష్‌నగర్ నుంచి ఎడ్లపల్లి వైపు వెళ్తుండగా కల్వర్టు వద్ద మావోయిస్టులు ల్యాండ్‌మైన్ పేల్చారు. ఈ ఘటనలో ఎస్ఐ సుభాన్‌తో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు దుర్మరణం చెందారు. సుభాన్ త్యాగానికి గుర్తుగా 2019 అక్టోబరు 21న కమాన్‌పూర్ ఠాణా ఎదురుగా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇలాంటి పోలీసు త్యాగధనుల విగ్రహాలను ఉమ్మడి జిల్లాలోని పలు చోట్ల ఏర్పాటు చేసి వారి సేవలను స్మరించుకుంటున్నారు.



సుభాన్

■ జగిత్యాల జిల్లా హబ్సీపూర్ ప్రాంతంలో మావోయిస్టు దళం ఉందన్న సమాచారంతో 1991 సెప్టెంబరు 10న పోలీసు బృందం అక్కడికి చేరుకుంది. మావోయిస్టుల కాల్పుల్లో జగిత్యాల రూరల్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేసిన మోబిన్ అక్కడికక్కడే మృతి చెందారు.

మందుపాతరకు బలి

అది 1991 డిసెంబరు 19. హుస్నాబాద్ మండలం రామవరం. ఆర్టీసీ బస్సులో చోరీ జరిగిందన్న సమాచారంతో ఉదయం 9.30 గంటల ప్రాంతంలో సీఐ యాదగిరి, ఎస్ఐ జాన్‌విల్సన్ తమ బృందంతో కలిసి అక్కడికి చేరుకున్నారు. విచారణ పూర్తయిన తర్వాత ఆర్టీసీ బస్సులో తిరిగి హుస్నాబాద్ బయలుదేరారు. రామవరం సమీపంలో మావోయిస్టులు పేల్చిన మందుపాతరకు సీఐ యాదగిరి, ఎస్ఐ జాన్‌విల్సన్, సీఆర్‌పీఎఫ్ ఎస్ఐ కశ్మీరీలాల్‌తో పాటు ముగ్గురు సీఆర్‌పీఎఫ్ జవాన్లు, అయిదుగురు ఆర్టీసీ అధికారులు, నలుగురు గ్రామస్థులు మృతి చెందారు. మరో 9 మంది కానిస్టేబుళ్లు గాయపడ్డారు.



జాన్‌విల్సన్



యాదగిరి

■ 1996 సెప్టెంబరు 7న రాత్రి రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిజామాబాద్‌లోని టెలిఫోన్ ఎక్స్ఛేంజిని మావోయిస్టులు దహనం చేశారు. ఈ ఘటనపై విచారణ కోసం 8న ఉదయం కానిస్టేబుల్ కె.మోహన్‌రావు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మావోయిస్టులు ల్యాండ్‌మైన్ పేల్చారు. ఈ ఘటనలో ఆయనతో పాటు మరో కానిస్టేబుల్ ఎం.డి.నజీర్ ప్రాణాలు కోల్పోయారు.

సమాజ రక్షణలో సాంకేతిక దన్ను

■ అమరుల త్యాగాలు, ఎదురవుతున్న సవాళ్లతో పాఠాలు నేర్చిన పోలీసు శాఖ అనేక సంస్కరణలు అమలు చేస్తోంది.

■ శాంతిభద్రతల పరిరక్షణలో ఎదురవుతున్న ఒడుదొడుకులను తట్టుకునేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చింది.

■ ఎక్కడ ఎలాంటి ఘటన జరిగినా క్షణాల్లో సమాచారం అందేలా ఏర్పాట్లు చేసింది. ఇందు కోసం 100 డయల్‌ను వినియోగంలోకి తీసుకొచ్చింది.



పోలీసు యాప్స్, టోల్‌ఫ్రీ నెంబర్లు

■ సీసీ కెమెరాలు, ఫోన్ యాప్‌లు, టోల్‌ఫ్రీ నెంబర్లతో ప్రజల్లోకి వెళ్తున్న పోలీసు శాఖ ఎక్కడా ప్రాణ నష్టం లేకుండా ప్రజలకు సేవలందిస్తోంది.

■ కంట్రోల్ రూం నుంచే శాంతిభద్రతలను పర్యవేక్షించే స్థాయికి చేరుకుంది. మహిళలు, యువతులు, విద్యార్థినుల భద్రతకు స్మార్ట్‌ఫోన్లలో యాప్‌లు రూపొందించింది.

■ అవాంఛనీయ ఘటనలు జరిగినపుడు పెట్రో కార్, మొబైల్ పార్టీలు, 100 డయల్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకునేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకుంది.

■ స్వీయ భద్రతతో పాటు ప్రజలకు రక్షణ కల్పించడంలో పోలీసు శాఖ ప్రత్యేకత చాటుకుంటోంది.



ఇంటి స్థల వివాదం.. అన్నను హత్య చేసిన తమ్ముడు



సాయిలు

మల్లాపూర్, న్యూస్‌టుడే: ఇంటి స్థల వివాదంలో అన్నను తమ్ముడు హతమార్చిన దారుణ ఘటన మల్లాపూర్ మండలం ఒబులాపూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒబులాపూర్ గ్రామానికి చెందిన పల్లెపు సాయిలు(34)తో అతడి తమ్ముడు చందుకు మధ్య కొన్నేళ్లుగా ఇంటి వద్ద స్థలం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయి. పాత గొడవలను దృష్టిలో పెట్టుకొన్న తమ్ముడు అన్నను హతమార్చాలని పథకం రచించాడు. ఆదివారం మధ్యాహ్నం సాయిలు గోదావరి తీరంలో ఒంటరిగా ఉన్నట్లు తెలుసుకున్న చందు అక్కడికి చేరుకొని మెడపై తల్వార్‌తో దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై కిరణ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సాయిలు తల, మొండెం వేర్వేరుగా ఉన్నట్లు గుర్తించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెట్‌పల్లి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు చందు పరారీలో ఉండటంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. హత్యా ఘటనతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

ఉపాధి లేక నేత కార్మికుడి ఆత్మహత్య



సంపత్

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: నాలుగు నెలలుగా పని లేకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని తీవ్ర మనస్తాపానికి గురై ఓ నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం సిరిసిల్లలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం బీవైనగర్‌కు చెందిన ఆడెపు సంపత్ (60), మాలతి దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అందరికీ వివాహాలు చేశారు. చిన్న కొడుకు అద్దెకు ఉంటున్న ఇంటి వద్ద ఓ గదిలో సంపత్, మాలతి ఉంటున్నారు. నాలుగు నెలలుగా ఉపాధి లేకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, పది రోజుల క్రితం మాలతి కుమార్తె ఇంటికి వెళ్లింది. చేయడానికి పని లేకపోవడంతో కుటుంబ పోషణ భారమై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ కృష్ణ తెలిపారు.

నదిలో మునిగి సీతంపేట వాసి మృతి



వేణుగోపాల్

జమ్మికుంట, న్యూస్‌టుడే: ఇల్లందకుంట మండలం సీతంపేటకు చెందిన పోతన వేణుగోపాల్(38) కర్ణాటకలోని రాయచూరు జిల్లాలో కృష్ణా నదిలో మునిగి మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. రాజేంద్రం-సరస్వతి దంపతుల కుమారుడు వేణుగోపాల్ ఈ నెల 17న దత్తాత్రేయస్వామిని దర్శించుకునేందుకు రాయచూరు వెళ్లాడు. కృష్ణానదిలో స్నానం చేసేందుకు దిగుతూ ప్రమాదవశాత్తు అందులో పడిపోయారు. నది పక్కనే బ్యాగు ఉండటంతో పరిసర ప్రాంతవాసులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు వచ్చి బ్యాగు వేణుగోపాల్‌దిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ నెల 19 ఘటనా స్థలానికి 40 కి.మీ దూరంలో జాలర్లకు వేణుగోపాల్ మృతదేహం కనిపించింది. వేణుగోపాల్ మృతితో గ్రామంలో విషాదం చోటు చేసుచేసుకుంది. ఆదివారం మృతదేహాన్ని సీతంపేటకు తీసుకుస్తున్నట్లు కుటుంబీకులు చెప్పారు.

జూనియర్ అసిస్టెంట్ బలవన్మరణం



సంగీత

వీణవంక, న్యూస్‌టుడే: ఇప్పలపల్లి గ్రామానికి చెందిన గువ్వల సంగీత(33) ఆదివారం బలవన్మరణానికి పాల్పడ్డట్లు వీణవంక ఎస్ఐ తిరుపతి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సంగీత భర్త కొండయ్య పది సంవత్సరాల క్రితం మృతి చెందారు. వీరికి కూతురు కిరణ్మయి ఉంది. సంగీత నీటిపారుదల శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా చొప్పదండిలో విధులు నిర్వహిస్తున్నారు. రెండు నెలలుగా జ్వరంతో బాధ పడుతూ తీవ్ర అనారోగ్యానికి గురై జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఆదివారం ఉదయం ఉరి వేసుకున్నారు. దీంతో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి కిరణ్మయి అనాథగా మారింది. మృతురాలి తల్లి మధునమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ఠాణా ఎదుట ఆత్మహత్యాయత్నం



రెహమాన్

పెద్దపల్లి, న్యూస్‌టుడే: చోరీ కేసులో అనుమానితుడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన పెద్దపల్లి ఠాణా ఎదుట జరిగింది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. పురపాలిక మాజీ ఛైర్మన్ ఎలువాక రాజయ్య శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి బస్సులో వచ్చి పెద్దపల్లి కమాన్ వద్ద సన్నిహితుడి కోసం నిరీక్షిస్తున్నారు. ఈ క్రమంలో ఆటోలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు రాజయ్యపై దాడి చేసి అతడి చేతిలోని బ్యాగును లాక్కెళ్లారు. ఈలోగా అక్కడికి చేరుకున్న సన్నిహితుడితో కలిసి రాజయ్య ఆటోను వెంబడించారు. ఓ చోట వారిని పట్టుకునే యత్నంలో ఆటోను డ్రైవర్ వేగంగా వెనక్కి తిప్పి వెళ్లిపోయాడు. అందులో వెళ్తున్న వారు తలోవైపు పరుగు తీశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పెట్రోలింగ్ సిబ్బంది అనుమానాస్పదంగా కనిపించిన ఆటోను ఠాణాకు తరలించారు. ఆదివారం ఉదయం ఆటో డ్రైవర్ రెహమాన్ అక్కడికి చేరుకొని.. రాత్రి జరిగిన ఘటనతో తనకు సంబంధం లేదంటూ ఒంటిపై పెట్రోల్ పోసుకోవడంతో పోలీసులు అడ్డుకొన్నారు. ఈ విషయమై ఎస్సై లక్ష్మణ్‌రావును వివరణ కోరగా విచారణ జరుగుతున్న క్రమంలో పెట్రోల్ పోసుకొని కేసును తప్పుదారి పట్టించేందుకు యత్నించడం సరికాదన్నారు. మరోవైపు ఆదివారం ఉదయం రాజయ్య ఇంటి ముందు బ్యాగు ప్రత్యక్షం కావడం గమనార్హం.



కర్రల వంతెనపై కష్టాల యానం

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పారుపల్లి నుంచి పోతారం వెళ్లే చెరువు వద్ద ఇటీవలి వర్షాలకు మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. ఇక్కడ వంతెన కోసం గతంలో నిధులు మంజూరు చేసినా గుత్తేదారు పనులు ప్రారంభించలేదు. దీంతో గ్రామస్థులు, వ్యవసాయదారులు, గొర్ల కాపరులు కర్రలతో ఇలా తాత్కాలిక వంతెనను ఏర్పాటు చేసుకున్నారు. దీనిపై నుంచే వాహనదారులు రాకపోకలు సాగిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. వంతెనతో పాటు పూర్తి స్థాయిలో బీటీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

\- న్యూస్‌టుడే, ముత్తారం

రాజన్న ఆలయ గోపురానికి బంగారు తాపడం

దేవాదాయ శాఖ అధికారుల ప్రణాళిక

న్యూస్‌టుడే, వేములవాడ

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ గోపురానికి బంగారు తాపడం చేయడానికి దేవాదాయ శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఆలయానికి చెందిన బంగారు నిల్వలు గోపురానికి బంగారు తాపడం చేసేందుకు సరిపోతాయా? లేదా అనే అంశంపై సమీక్షించిన అనంతరం అధికారులు ఓ అంచనాకు రానున్నట్లు తెలుస్తోంది.

రాజన్నను దర్శించుకునేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి రోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారు. స్వామివారిని దర్శించుకున్నవారు వివిధ రకాల కానుకలను సమర్పిస్తారు. ఆలయంలో జరిగే ఉత్సవాల సందర్భంగా లక్షల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వీరిలో కొందరు బంగారం, మరి కొందరు వెండిని కానుకలుగా సమర్పిస్తుంటారు. ప్రస్తుతం ఆలయానికి చెందిన బంగారం 95 కిలోలు, వెండి 4,800 కిలోలు ఉంది. బంగారు తాపడంతో ఆలయానికి కొత్త శోభ సంతరించుకోనుంది.

గతంలోనే ప్రతిపాదన

రాజన్న ఆలయ గోపురానికి బంగారు తాపడం చేయాలని గతంలోనే ఆలయ అధికారులు, అప్పటి ఆలయ పాలకవర్గం ప్రతిపాదనలు చేసింది. ఇందుకు తిరుమల తిరుపతి దేవస్థానానికి నిధులు సమకూర్చారు. అయితే అంచనాలు పెరిగిపోవడంతో ఆ నిధులు సరిపోవని తిరిగి వెనక్కి పంపించారు. దీంతో అప్పటి నుంచి ఇది పెండింగ్‌లో ఉండిపోయింది.



రాజన్న ఆలయం

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి



ఆలయ గోపురానికి బంగారు తాపడం చేసేందుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ఎంత బంగారం అవసరమవుతుందనేది ముందుగా అంచనా వేస్తారు. ప్రస్తుతం ఆలయానికి ఉన్న బంగారం నిల్వల ప్రకారం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తరవాత బంగారు తాపడం ప్రక్రియ మొదలవుతుంది. **- వినోద్‌రెడ్డి, ఈవో, రాజన్న ఆలయం, వేములవాడ**

సహకారంతో అన్నీ సాధ్యమే

కరీంనగర్ డెయిరీ ఛైర్మన్ రాజేశ్వర్‌రావు



జ్యోతి వెలిగించి భారతి రాష్ట్ర మహాసభలను ప్రారంభిస్తున్న కరీంనగర్ డెయిరీ ఛైర్మన్ రాజేశ్వర్‌రావు

చింతకుంట (కరీంనగర్ కొత్తపల్లి), న్యూస్‌టుడే: సహకార సంఘాలు నిజాయతీ, నిబద్ధతతో పని చేయాలని, సహకారంతోనే ఏదైనా సాధించవచ్చని కరీంనగర్ డెయిరీ ఛైర్మన్ రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం కొత్తపల్లి మండలంలోని చింతకుంట గ్రామంలో చింతకుంట సహకార సంఘం ఆధ్వర్యంలో సహకార భారతి తెలంగాణ శాఖ నాలుగో రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజేశ్వర్‌రావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశంలో సహకార సంఘాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, వీటికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి చేయూత అందించాల్సిన అవసరముందన్నారు. సహకార భారతి రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సంఘం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కార్యక్రమాలను నిర్వహిస్తోందని, రాబోయే రోజుల్లో మరింత బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభలో ప్రధాన వక్త ఆయాచితుల లక్ష్మణరావు, సహకార భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు న్యాలమడుగు శంకరయ్య, జాతీయ కార్యదర్శి నందినిరాయ్, రాష్ట్ర నాయకులు కుమారస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, జిల్లా అధ్యక్షుడు తుమ్మల రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా...

(10 AM TO 1 PM)
జగిత్యాల 94400 23123
కోరుట్ల 9491324656 ధర్మపురి 94403 88638

? రైతు సహకార సంఘాలద్వారా ధాన్యం కొనుగోలుకు అవకాశమిస్తారా?
- తిరుపతి

✓ గతంలో ఇచ్చిన అనుమతులను పరిశీలించి రైతు సంఘాలకు తాజా అనుమతిపై నిర్ణయం తీసుకుంటాము. - మనోజ్‌కుమార్, డీసీవో

– న్యూస్‌టుడే, జగిత్యాల వాణిజ్యం

? కోరుట్ల పట్టణం ముత్యాలవాడలోని ప్రధాన మురుగు కాలువలను నెల రోజులుగా శుభ్రం చేయకుండా వదిలేశారు. కాలువలో చెత్తాచెదారం చేరి దుర్గంధం వెదజల్లడంతోపాటు దోమల వ్యాప్తికి కారణమవుతోంది.
-భూమయ్య, కోరుట్ల

✓ వెంటనే పారిశుద్ధ్య కార్మికులతో ముత్యాలవాడలోని ప్రధాన మురుగు కాలువలను తొలగించేలా చర్యలు తీసుకుంటా.
-అశోక్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్
న్యూస్‌టుడే, కోరుట్ల

పురుగు మందు తాగి ఆత్మహత్య

వెల్గటూరు: ముక్కట్రావుపేటకు చెందిన మొండయ్య (46) పురుగు మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానిక ఠాణా అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మృతుడు రెండేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. మనస్తాపంతో ఈ నెల 16న పురుగు మందు తాగి బలవన్మరణానికి యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు తీవ్ర గాయాలు

కొడిమ్యాల, న్యూస్‌టుడే: కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామశివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివారాల మేరకు.. మల్యాల మండలం గుడిపేటకు చెందిన కుసుమ రాము స్నేహితుడు బల్వంతాపూర్ గ్రామానికి చెందిన అభిలాష్‌తో కలిసి కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామంలోని తన అక్క ఇంటికి వచ్చాడు. సాయంత్రం సమయంలో తిరుగు ప్రయాణంలో నాచుపల్లి గ్రామశివారులో ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో రాము, అభిలాష్‌లకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జగిత్యాలలోని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ముంబయిలో ఉంటున్న రాము ఆదివారమే స్వగ్రామానికి వచ్చినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కారు ఢీకొని..

జగిత్యాల గ్రామీణం: జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట వద్ద ఆదివారం సాయంత్రం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో మండలంలోని హబ్సీపూర్ గ్రామానికి చెందిన బొడ్డు శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉంది. జగిత్యాల రూరల్ పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

బాలికపై అత్యాచార యత్నం?

మల్యాల: మల్యాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారయత్నం జరిగినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మూడు రోజుల కిందట బాలిక సమీప బంధువైన యువకుడు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డట్లు సమాచారం. ఈ విషయమై బాలిక కుటుంబ సభ్యులు పంచాయితీ పెద్దలను ఆశ్రయించగా వారు అంతర్గతంగా ఇరువర్గాలను ఒప్పించినట్లు తెలిసింది. ఈ విషయమై మల్యాల ఎస్సై నరేష్‌ను వివరణ కోరగా బాధితురాలి కుటుంబ సభ్యుల నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పేర్కొన్నారు.

తేనెటీగల దాడిలో పలువురికి గాయాలు

రామన్నపేట: రామన్నపేట గ్రామంలోని చౌరస్తాలో ఆదివారం సాయంత్రం ఓ చెట్టు కొమ్మపై తేనెతుట్టెను దులిపేందుకు నూకపల్లి అర్బన్ కాలనీకి చెందిన ముగ్గురు వ్యక్తులు చెట్టు ఎక్కగా ఓ వ్యక్తి చెట్టుపై నుంచి జారి కింద పడ్డట్లు స్థానికులు తెలిపారు. అదే సమయంలో తేనెటీగలు దారిని వెళ్తున్న ద్విచక్రవాహన చోదకులపై దాడి చేయడంతో ముగ్గురు మహిళలు గాయపడ్డట్లు వివరించారు. తీవ్రంగా గాయపడ్డ అర్బన్ కాలనీకి చెందిన వ్యక్తిని జగిత్యాల ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు వివరించారు.



గుంతలోకి దూసుకెళ్లిన కారు

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల శంఖులపల్లి చౌరస్తాలో ఆదివారం సాయంత్రం ఓ కారు అతి వేగంగా వెళ్లి అదుపు తప్పి రహదారి కింది వైపు గుంతలోకి దూసుకెళ్లింది. కారులో ఓ మహిళ ఇరుక్కుపోగా స్పందించిన స్థానికులు అతికష్టం మీద బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. మరో వ్యక్తికి గాయలయ్యాయి.

విద్యుదాఘాతంతో గేదె మృతి

గుంజపడుగు(గొల్లపల్లి): గుంజపడుగుకు చెందిన రైతు చంద్రయ్యకు చెందిన గేదె విద్యుదాఘాతంతో ఆదివారం మృతి చెందింది. మేత మేస్తూ స్థానిక చెరువు సమీపంలోని విద్యుత్ నియంత్రికను తాకడంతో గేదె మృతి చెందిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

జగిత్యాల, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి దేవయ్య, బోయిన్‌పల్లి ప్రసాద్‌రావు అన్నారు. ఆదివారం గీతాగ్రంథాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ ఉపాధ్యాయులు అత్యవసరం కోసం దాచుకున్న జీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, సప్లిమెంటరీ వేతనాల బిల్లులు ఏడాది కాలం కావస్తున్న మంజూరు కావడం లేదన్నారు. రాష్ట్ర సహాధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు హౌడ్నాల రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి వీరమల్ల వెంకటరమణారావు, ఎలిగేటి రాజేంద్రప్రసాద్, గుడిసె పూర్ణచందర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య





ప్రతిభ చాటి.. బహుమతులు సాధించి

'ఈనాడు' ఆధ్వర్యంలో మెట్‌పల్లిలోని శ్రీవిజయసాయి సెంట్రల్ హైస్కూల్లో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్, మొబైల్ ఫోన్ వినియోగం, ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రతిభ చాటారు. మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులు పి.సంకీర్తన, పి.సి.రక్షిత, ఆఫియా మావిన్‌లకు పాఠశాల కరస్పాండెంట్ పుల్ల ప్రదీప్ గౌడ్ బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. డైరెక్టర్స్ శ్రీరామ్ భూపాల్, మనస్విని, ప్రిన్సిపల్ రమ్యకృష్ణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం

రోడ్డు నిర్మాణం చేపట్టాలని మహిళల ఆందోళన

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల పట్టణంలోని 9, 10, 11వ వార్డుల ప్రధాన రోడ్డు పూర్తిగా దెబ్బతిని 10 ఏళ్లుగా ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలంటూ మహిళలు, వార్డు ప్రజలు ఆదివారం రాస్తారోకో చేపట్టారు. గర్భిణులు, వృద్ధులు ద్విచక్ర వాహనాలపై వెళ్లడంతో ప్రమాదాలకు గురై అనారోగ్యం పాలవుతున్నారని వాపోయారు. గుంతలమయంగా మారిన ప్రకాశంరోడ్‌పై నూతనంగా సిమెంట్‌రోడ్ నిర్మించాలని కోరారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వారికి సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు. విజయ, దివ్య, రాధ, సంధ్య, సరోజన, ప్రమీల, జల, రాజేశ్వరి, అర్చన, లత తదితరులు పాల్గొన్నారు.



కోరుట్ల రహదారిపై రాస్తారోకో చేపట్టిన మహిళలు

స్థల ఎంపికలో అయోమయం!

మల్యాల, న్యూస్‌టుడే: కొండగట్టులో భక్తుల వసతి కోసం తితిదే నిధులతో నిర్మించనున్న వంద గదుల నిర్మాణానికి స్థల ఎంపికలో రాజకీయ నాయకుల జోక్యం వివాదంగా మారినట్లు తెలిసింది. జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కొండగట్టు పర్యటన సందర్భంలో భక్తుల సౌకర్యం కోసం తితిదే నిధులతో గదులు నిర్మించాలని అప్పటి ఈవో విన్నవించడంతో అంగీకరించారు. ఈనెల 5న తితిదే ఇంజినీరింగ్ అధికారులు స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి కొండగట్టులో స్థలాలను పరిశీలించారు. 'వై' జంక్షను వద్ద, 1.5 కి.మీ దూరంలోని జేఎన్టీయూ కళాశాలకు వెళ్లే దారి పక్కన 1.17 ఎకరాల ఆలయ స్థలాన్ని పరిశీలించారు. చివరికి 'వై' జంక్షను సమీపంలోని ఘాట్‌రోడ్డు పక్కన స్థలం అనువుగా ఉందని ఎమ్మెల్యే ప్రకటించారు. కొందరు నాయకులు ఆలయానికి 1.5 కి.మీ దూరంలోని ప్రైవేటు భూములకు సమీపంలో వంద గదులు నిర్మించాలని పైరవీలు, ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై వాస్తవ పరిస్థితులను పరిశీలించడానికి ఏపీ, జనసేనకు చెందిన నాయకులను రెండు మూడు రోజుల్లో కొండగట్టుకు పంపిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై ఈవో రామకృష్ణారావును సంప్రదించగా కొండగట్టులోని 'వై' జంక్షన్ సమీపంలోని ఘాట్‌రోడ్డు పక్కన వంద గదుల నిర్మాణానికి అవసరమైన స్థలం ఉందని, అవసరమైతే పక్కనున్న ప్రభుత్వ స్థలాన్ని కూడా కేటాయించాలని జిల్లా పాలనాధికారికి లేఖ సమర్పించినట్లు వివరించారు. జేఎన్టీయూ కళాశాలకు వెళ్లే రహదారి పక్కన ఆలయానికి సంబంధించి 1.17 ఎకరాలు మాత్రమే ఉందని, ఘాట్‌రోడ్డు పక్కన స్థలం వంద గదుల నిర్మాణానికి అనువుగా ఉందని ఎమ్మెల్యే ప్రకటించిన తర్వాత అందుకు సంబంధించిన పత్రాలను ప్రభుత్వానికి పంపించినట్లు పేర్కొన్నారు.



కొండగట్టులో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యం, అధికారులు(పాతచిత్రం)

అందరూ శ్రీనివాసులే!



ఒకే పేరుతో ఉన్న వారందరూ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ దృశ్యం జగిత్యాలలో ఆదివారం ఆవిష్కృతమైంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని శ్రీనివాస్ పేర్లతో ఉన్నవారందరూ ఏడాది కిందట వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకున్నారు. గ్రూపులో వెయ్యికిపైగా శ్రీనివాసులు ఉండగా దాదాపు 200 మంది జగిత్యాల పట్టణంలోని వర్తక సంఘంలో సమావేశమై అనంతరం మార్కెట్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. సామాజిక కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, జగిత్యాల గ్రామీణం



జగిత్యాలలో ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు



కోరుట్ల: 2000-01 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



గొల్లపల్లిలో ఉపాధ్యాయులతో..

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల శారదా విద్యాలయం 1995-96 సంవత్సరం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సంగీత్‌లో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు నీరజాకుమారి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: కోరుట్ల పట్టణంలోని మహాత్మా విద్యానికేతన్ పాఠశాలలో 2000-01లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

గొల్లపల్లి: స్థానిక శ్రీరామ విద్యామందిర్‌లో 2003-04లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు.

సంఘాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలి

జగిత్యాల వాణిజ్యం, న్యూస్‌టుడే: మత్స్యపారిశ్రామిక సంఘాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువులో ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. జగిత్యాల నియోజకవర్గంలోని 155 చెరువుల్లో 20 లక్షల చేపపిల్లలను వదులుతామన్నారు. రూ.20 లక్షలతో రైతుబజార్‌లో చేపల మార్కెట్‌ను అభివృద్ధి చేశామని, రూ.4 కోట్లతో సమీకృత మార్కెట్‌ను నిర్మించామన్నారు. పురపాలక అధ్యక్షురాలు అడువాల జ్యోతి, కమిషనర్ చిరంజీవి, మాజీ అధ్యక్షుడు గిరి నాగభూషణం, మత్స్యశాఖ అధికారులు, కౌన్సిలర్లు బాలె లత, పద్మ, రాజ్‌కుమార్, రామ్‌కుమార్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



చింతకుంట చెరువులో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే, పుర అధ్యక్షురాలు

మిల్లర్లు ఇబ్బందులు పెడితే పీడీ యాక్ట్

కొడిమ్యాల, న్యూస్‌టుడే: కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం విషయంలో రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కొడిమ్యాల మండలంలోని 16 గ్రామాల్లో సెర్ప్, సహకారం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. భాజపా, భారాస కలిసి రైతులను మోసం చేస్తున్నాయని, భాజపా పాలనలో ఉన్న 16 రాష్ట్రాల్లో ఎందుకు రుణమాఫీ చేయలేదని విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు తమ అధికారం పోయిందనే అక్కసుతో కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. సింగిల్‌విండో ఛైర్మన్ మేనేని రాజనర్సింగరావు, ఏఎంసీ వైస్‌ఛైర్మన్ గడ్డం జీవన్‌రెడ్డి, తహసీల్దార్ రమేష్, ఏవో జ్యోతి, ఏపీఎం రాజేష్, పీసీసీ సభ్యులు మహిపాల్‌రెడ్డి, నారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ చొరవతోనే నిధుల మంజూరు

రాయికల్ పట్టణం: ఎమ్మెల్సీ కవిత చొరవతోనే అప్పటి తితిదే బోర్డు సభ్యుడుగా ఉన్న భారాస జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు శ్రీవాణి ట్రస్ట్ ద్వారా మండలంలోని పలు దేవాలయాలకు నిధులు మంజూరు చేశారని భారాస నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని హనుమాన్ ఆలయం, సింగరావుపేట, కొత్తపేట గ్రామాల్లోని ఆలయాలకు రూ.10 లక్షల వంతున మొత్తం రూ.30 లక్షలు మంజూరయ్యాయన్నారు. స్పందన, బర్కం మల్లేష్, కొల్లూరి వేణు, మోర విజయలక్ష్మి, రత్నాకర్‌రావు, గంగారాం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కమిటీల పేరుతో కాలయాపన సరికాదు

సారంగాపూర్: ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేయడం సరికాదని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని లక్ష్మీదేవిపల్లెలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బెజ్జంకి సతీష్, నక్క రమేష్, సునీల్, వేణుగోపాల్, ముత్తు, శేఖర్, గంగారాజం, రంజిత్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన ఏఈవోలు

జగిత్యాల వ్యవసాయం: జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారులు ఆదివారం హైదరాబాద్‌కు తరలివెళ్లి ఏఈవోల సంఘం రాష్ట్ర సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వే విధుల నుంచి తమను తప్పించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఏఈవోలు నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా సర్వే విధులను ప్రైవేటు సంస్థకు అప్పగించాలని ఏఈవోల సంఘం జిల్లా నాయకులు సురేందర్ నాయక్, శ్రీనివాస్, శివలీల తదితరులు కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాల పట్టణం: తెలంగాణలో ఇటీవలే విస్తరిస్తున్న స్క్రబ్‌టైఫస్ వ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్ సూచించారు. చెట్లపొదలు, అడవులు, పొలాలు, అపరిశుభ్ర పరిసరాల్లో సంచరించే పురుగులు, కీటకాలు కుట్టడంతో ఈ వ్యాధి సోకుతుందన్నారు. పురుగు కుట్టినచోట నల్లటి మచ్చ, తీవ్ర జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, మానసిక మార్పులు, ఒంటిపై ఎర్రటి దద్దుర్లు తదితర లక్షణాలు ఉంటాయన్నారు. పొలాల్లో, ఆరుబయట పనిచేసేవారు శరీరాన్ని కప్పేలా దుస్తులు ధరించాలని, జ్వరంవంటివి వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గంతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సంఘాలు– కార్యవర్గాలు

సారంగాపూర్: బీర్‌పూర్ మండల మున్నూరు కాపు సంఘ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా చీర్నేని శేఖర్, గౌరవ అధ్యక్షుడిగా జెగిశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా రామకిష్టు గంగాధర్, తాటి గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా చుక్క జనార్దన్, కోశాధికారిగా సైండ్ల మల్లేశం, కార్యదర్శులు, సలహాదారులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సంఘ కార్యవర్గాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మాసర్థి రమేష్‌తోపాటు పలువురు అభినందించారు.

జగిత్యాల ధరూర్‌క్యాంపు: బీసీ మహిళా సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా న్యాయవాది కోరుట్లకు చెందిన రాచకొండ రోజా నియమితులైనట్లు రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ నియామకం ఆదివారం నుంచి అమల్లోకి వస్తుందని వివరించారు.

కోరుట్ల: బీసీ మహిళా సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోరుట్ల పట్టణానికి చెందిన న్యాయవాది రాచకొండ రోజాను నియమిస్తు రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. బీసీ మహిళా సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు.



రోజా

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు సన్మానం

రాయికల్: రాయికల్ మండలం అల్లీపూర్-శ్రీరాంనగర్ గ్రామ రహదారి నిర్మాణానికి రూ. 1.54 కోట్లు నిధులు మంజూరు చేయించినందుకు గ్రామస్థులు ఆదివారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి

రాయికల్: రాయికల్ మండలం వస్తాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆదివారం గ్రామస్థులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామంలో కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు.

రాష్ట్ర స్థాయి డ్యూటీమీట్‌కు మేడిపల్లి ఎస్సై

మేడిపల్లి: పోలీసు శాఖ నిర్వహించిన రాష్ట్ర స్థాయి డ్యూటీమీట్‌కు జోనల్ తరపున మేడిపల్లి ఎస్సై శ్యాంరాజ్ ఎంపికయ్యారు. సైంటిఫిక్ ఎయిడ్స్ టూ ఇన్వెస్టిగేషన్‌కు సంబంధించి ఫింగర్ ప్రింట్, హ్యాండ్లింగ్ లిఫ్టింగ్ ప్యాకింగ్, ఫోరెన్సిక్ సైన్స్, ఫోరెన్సిక్ మెడిసిన్, క్రిమినల్ లా పరీక్షల్లో జిల్లా తరపున పాల్గొన్నారు. ఆయనను పలువురు పోలీసు అధికారులు అభినందించారు.



శ్యాంరాజ్

హనుమాన్ చాలీసా ముగింపు వేడుకలు

మెట్‌పల్లి పట్టణం: మెట్‌పల్లి పట్టణంలోని ఖాదీ ప్రతిష్ఠాన్‌లో ఆదివారం గీతా సత్సంగ్ ఆధ్వర్యంలో చీలమంతుల ఛత్రపతి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా మహా యజ్ఞం ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి నైవేద్యం, మహా హారతి నిర్వహించారు. ఛత్రపతి, రమేష్, హరీష్, నందయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి చేయూత

మెట్‌పల్లి పట్టణం: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోగుల రవిబాబు మృతి చెందగా, ఆయన కుటుంబానికి పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో ఆర్మూర్‌లో ఆయన సతీమణికి రూ.లక్ష చెక్కు అందజేశారు. బోయినపల్లి ఆనందరావు, యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, పీఆర్టీయూ టీఎస్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి కృషి

కొడిమ్యాల: విద్యార్థులు, యువత క్రీడల్లో రాణించాలని, ప్రభుత్వం తరపున క్రీడాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కొడిమ్యాల మండలం చెప్యాల గ్రామానికి చెందిన 20 మంది విద్యార్థులు ఇటీవల జరిగిన కరాటే పోటీల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. కోచ్ బరిగె లక్ష్మీరాజం, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే సత్యం

ఆరు గ్యారంటీల కరపత్రం దహనం



నిరసన తెలుపుతున్న మహేందర్

మల్లాపూర్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందంటూ మల్లాపూర్ మండలం గుండంపల్లి గ్రామానికి చెందిన తోట్ల మహేందర్ అనే రైతు ఆరు గ్యారంటీల కరపత్రంను పంచాయతీ కార్యాలయం ఎదుట ఆదివారం దహనం చేశారు. మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేయవద్దని సూచించారు.

ప్రభుత్వ విప్ పరామర్శ

బుగ్గారం: మండలంలోని బుగ్గారం, సిరికొండ, గోపులాపూర్ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన వ్యక్తుల కుటుంబాలను ఆదివారం ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుభాష్, నాయకులు నర్సగౌడ్ తదితరులున్నారు.

ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులు

పెగడపల్లి: మండలంలోని ఆదర్శ పాఠశాలలో హిందీ బోధించేందుకు అర్హులైన వారినుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. హిందీ పండిత్ శిక్షణతోపాటు టెట్ ఉత్తీర్ణులయినవారు అర్హులని తెలిపారు. 6 నుంచి 10 తరగతులకు బోధించేందుకు ఆసక్తి గలవారు 22న నిర్వహించే డెమో పరీక్షకు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

జోనల్‌స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

కోరుట్ల, న్యూస్‌టుడే: కథలాపూర్ మండలం అంబారిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనుగందుల రాజశేఖర్ అథ్లెటిక్స్ విభాగంలో జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ రాజేశ్ ఆదివారం తెలిపారు. జగిత్యాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో 100 మీటర్ల పరుగు పందెంలో ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. విద్యార్థి రాజశేఖర్‌ను ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రావు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.



రాజశేఖర్



భారాస నాయకుల నిరసన

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా అమలు చేయకుండా హామీని విస్మరించిందంటూ భారాస నాయకులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఆయా మండలాల్లో ప్రధాన రహదారులపై బైఠాయించి నిరసన, ధర్నా నిర్వహించారు. - న్యూస్‌టుడే యంత్రాంగం



మేడిపల్లి: ధర్నా చేస్తున్న భారాస నాయకులు



కోరుట్ల రహదారిపై భారాస నాయకుల ధర్నా



మల్యాల మండల పరిషత్ చౌరస్తాలో..



ఇబ్రహీంపట్నంలో..



ధర్మపురిలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జడ్పీ మాజీ ఛైర్ పర్సన్ వసంత



రాయికల్‌లో..



గొల్లపల్లిలో రోడ్డుపై బైఠాయింపు..



మెట్‌పల్లిలో..



వెల్గటూరులో..



మల్లాపూర్‌లో..